# పరంపర

ఎస్. శ్రీదేవి

ఒక్కసారి మూడు సంధిగ్ధాలలో ఇరుక్కుపోయాను. మూడిటి వెనుకా ఉన్నది ఒకటే. డబ్బు. ఏ ఒక్క అవసరానికీ చాలనంత డబ్బు.

"ఇంటి విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావటం లేదన్నయ్యా! ఒక్కసారి కట్టించుకుంటాం గానీ పదే పదే కట్టించుకోం కదా? గ్రానైట్ వేయిద్దామంటోంది అశ్విని. అలాగే గోడలకి పెయింట్లు. దాబా పిట్టగోడ, ప్రహరీ మిగిలిపోయాయి. మళ్లీ మళ్లీ పని పెట్టుకోకుండా అన్నీ పూర్తి చేసేద్దామనుకుంటున్నాం. ఇంకా రెండు మూడు లక్షలేనా అవసరమయ్యేలా ఉంది. దొరికినచోటల్లా అప్పుచేశాను. ఇంకెక్కడా పుట్టే అవకాశం లేదు. ఇంక నా జీతం కూడా పర్మిట్ చెయ్యదు. నువ్వే పీయఫ్ లోనో, బేంకు పర్సనల్ లోనో ఏదో తీసుకుని సర్దాలి. నేను కొంచెం సర్దుకోగానే తిరిగిచ్చేస్తాను" అని ఉదయ్ ఫోన్ చేసిన కాసేపటికే మంజు చేసింది.

వాళ్లమ్మాయికి అమెరికా సంబంధం కుదిరేలా ఉందట. పది దాకా అడుగుతున్నారట. ఎనిమిది మించి ఇవ్వనని వాళ్లాయన కిషోర్ కచ్చితంగా చెప్పేశాడట.

"అలా అనుకుంటే ఎలా కుదురుతుందిరా? మంచి సంబంధం. వదులుకుంటే మళ్లీ అలాటిది దొరుకుతుందా? అన్నయ్యా! ఎలాగేనా నువ్వా రెండూ సర్దాలిరా! చిన్నన్నయ్యని అడుగుదామంటే వాడు ఇల్లు కడుతున్నాడు. నిండా అప్పుల్లో ఉన్నాడు. ఎలా అడగను? నీమీదే నా ఆశలన్నీ. ఈ సంబంధం కుదిరిపోతే నిరూ సుఖపడుతుంది. ఇంక తిరిగి చూసుకోనక్కర్లేదు మనం" అంది.

ఈ రెండూ విన్నాక నా భార్య విజయ అల్టిమేటం ఇచ్చేసింది. "మీ తమ్ముడు ఇరవై లక్షలు పెట్టి ఇల్లు కడుతున్నాడు. గృహప్రవేశానికి మనం వెళ్లాలి. నాకు నగలేవీ లేవు. ఎప్పుడడిగినా ఏదో ఒకటి చెప్తున్నారు. అసలే మీ మరదలికి నెత్తిమీద ఉంటాయి కళ్లు. ఇప్పుడింకా పైకెక్కి ఉంటాయి. ఈ అవతారంతో ఇలాగే వెళ్లానంటే పనివాళ్ల పక్కని కూర్చోబెట్టి మర్యాదలు చేసి పంపుతుంది. ఇహ మీ చెల్లెలు... అమెరికా అల్లుణ్ని తెచ్చుకోబోతోంది. కనీసం సెకండు హేండు కారేనా లేకపోతే వాళ్ల కార్లలోనూ వీళ్ల కార్లలోనూ తిరిగే దేభ్యం మొహాల్లా కనిపిస్తాం. అప్పే చేస్తారో మరేం చేస్తారో మీ ఇష్టం. నాకు మాత్రం రెండు జతల గాజులూ, వసంత హారం, నెక్లెసూ కావాలి. మా తమ్ముడు కారు మారుస్తాడట. పాతది మనం తీసుకుందాం. లేకపోతే ఈ ఫంక్షన్సుకి నేను రాను. మీరొక్కరూ వెళ్లి వచ్చెయ్యండి" అంది.

నాకు ఎటూ తోచలేదు. మహా అయితే లక్షన్నరో రెండు లక్షలో ఉంటాయి నా దగ్గర. విజయ మాటల్ని తీసిపారెయ్యటానికి లేదు. అశ్విని మనుషుల్ని డబ్బుతో కొలుస్తుంది. ఆ విషయం నాకు తెలీనిది కాదు. మంజు అలాంటిది కాకపోయినా, కార్లున్న పదిమంది మధ్య కారు లేకుండా మేం ఉండటమనేది వాళ్లకీ మాకూ కూడా ఇబ్బంది కలిగించే విషయమే. ఎవరిది కచ్చితమైన అవసరమో నేను తేల్చుకోలేకపోతున్నాను.

ఈలోగా మళ్లీ ఫోన్లు.

"ఏం చేశావన్నయ్యా? లోన్‌కి అప్లై చేశావా?" అని ఉదయ్.

"వాళ్లకి మాటిచ్చెయ్యమంటావా?" అని మంజు.

"నన్ను కొంచెం ఆలోచించుకోనీవే. ఉన్నపళంగా రెండు లక్షలంటే ఎక్కడ్నుంచీ తేను? మీ అందరికన్నా చిన్న ఉద్యోగం నాది. అంతంత డబ్బు ఎక్కడ్నుంచీ వస్తుంది?" నా మాటల్లో కొంచెం విసుగు ధ్వనించిందేమో తను హర్టైంది.

"మీ పిల్లలు చిన్నవాళ్లు. నీకు బాధ్యతలూ లేవు. అందుకని ఆపాటి ఉండకపోతాయాని అడిగాను. అంత ఇబ్బందైతే వద్దులే. ఏదో ఒక తలకిమాసిన సంబంధమే కుదుర్చుకుంటాం" నిష్ఠూరంగా అంది.

"ఉదయ్ కూడా వాడింటి విషయంలో డబ్బు సర్దమని అడిగాడు" అర్థం చేసుకుంటుందని అన్నాను.

"ఇంటి పని వేరు. పిల్ల పెళ్లి వేరు. డబ్బు చాలకపోతే ఇంటిపని ఆపుకోవచ్చు" అంది తను.

"కిషోర్‌తో నేను మాట్లాడనా?"

"ఏం మాట్లాడతావు? మీరిచ్చేట్లైతే సంబంధం ఒప్పుకుందామన్నారు"


నేను జవాబేమీ చెప్పకుండా పెట్టేశాను. విజయ అక్కడే ఉంది. విషయం గ్రహించినట్టుంది. కోపంగా అక్కడి నుంచీ వెళ్లిపోయింది. అమ్మా అక్కడే ఉంది. తనకేసి సాలోచనగా చూశాను. "మా పెద్దన్నయ్యని సలహా అడుగు" అంది నెమ్మదిగా.

ఆశ్చర్యంగా చూశాను. ఒక గొడవ కారణంగా మాకూ వాళ్లకీ రాకపోకలూ, పరామర్శలూ ఆగిపోయాయి. చాలా కాలమైంది. గొడవ..

నేను ఇంటర్మీడియెట్ పాసయ్యానప్పటికి. మంచి మార్కులు వచ్చాయి. ఎంసెట్‌లో మంచి రేంకు వచ్చింది. అప్పట్లో ఇన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లేవు. వరంగల్లోనూ, హైదరాబాద్‌లోనూ ఉండేవి. ఎంసెట్ రాయటమైతే రాశాను గానీ అంతంత ఫీజుల్ని కట్టి హాస్టల్లో పెట్టి చదివించడం తన వల్ల కాదన్నారు నాన్న. అమ్మ ఏడ్చింది. గొడవ చేసింది. నాన్న వినలేదు. తనకి పెళ్లప్పుడు ఇచ్చిన అరెకరం అమ్మి చదివించమంది. మంజు పెళ్లి ఏం పెట్టి చేస్తావని అడిగారు. నాన్నది ఎల్డీసీ ఉద్యోగం. నెలాఖర్లో చేబదుళ్లు తీసుకోకుండా ఏ నెలా గడిచేది కాదు. ఏదో ఒకలా నాకు పెద్ద చదువు చెప్పిస్తే పెద్ద ఉద్యోగం వచ్చి కుటుంబ పరిస్థితులు బాగుపడతాయని ఆమె ఆలోచన. పద్ధెనిమిదేళ్లు నిండగానే తనలాగే ఏదో ఒక ఉద్యోగం చూసుకుని తనకి ఆసరా అవ్వాలని నాన్న కోరిక. ఇద్దరూ బాగా గొడవపడ్డారు. అమ్మ తాతయ్య దగ్గరకి బయల్దేరింది. వెంట నేనూను.

"నీమీద కొండంత ఆశతో వచ్చానన్నయ్యా! వీడికి చదువు చెప్పించి నీ అల్లుడినీ చేసుకో" అంది పెద్దమామయ్యతో.

మామయ్య నవ్వి, "రెండు విషయాలూ కలపకమ్మా!" అన్నాడు. అని, "బావ చెప్పించలేని చదువు నేను మాత్రం చెప్పించగలనా? నాదీ చిన్న జీతమే కదా? నాకూ ఇద్దరు పిల్లలున్నారు. వాళ్లు ఎదుగుతున్నారు. బావ చెప్పినట్టు బియ్యేలో చేరి, పద్ధెనిమిది



నిండగానే ఏదేనా జాబ్ వెతుక్కుని, ఈవెనింగ్ కాలేజీలోనో ప్రైవేట్‌గానో కంప్లీట్ చేస్తే సరిపోతుంది" అన్నాడు.

అమ్మ హతాశురాలైపోయింది. "నువ్వూ అలాగే అంటే ఎలాగన్నయ్యా? నువ్వు కాదనవని ఎంతో నమ్మకంతో వచ్చాను. అప్పుగానే సర్దన్నయ్యా! వాడికి ఉద్యోగం రాగానే తీర్చేస్తాడు. లేకపోతే నీ కూతుర్నిచ్చి చెయ్యి" అంది.

"అవన్నీ జరగని పనుల్లేవే. మన తాహతెంతో అంతలోనే ఆలోచనలుండాలి. అందని ఎత్తుకి ఎగరడం దేనికి?" అన్నాడు.

ఎంతో నిరాశతో తిరిగొచ్చాం. బామ్మా, తాతయ్యా అక్కడే ఉన్నారు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఆ రోజు తర్వాత మామయ్యా వాళ్లతో మాకు అనుబంధాలు తెగిపోయినట్టే. రాకపోకలు ఆగిపోయాయి. పెళ్లిళ్లలోనూ, ఫంక్షన్లలోనూ కలిసేవాళ్లం. వాళ్లేమేం కొనుక్కున్నారో, అత్తయ్యకి ఏమేం నగలు చేయించాడో, వాళ్ల పిల్లలెలా చదువుతున్నారో ఎక్కడ చదువుతున్నారో డేగకళ్లతో గమనించేది అమ్మ.

"నిన్ను చదివించడానికి డబ్బుల్లేవన్నాడా, అత్తయ్యకి చూడు, గాజులు చేయించాడు. స్కూటరు కొన్నాడు చూడు. చదువుకుంటానని ఏడ్చిన పిల్లాడికి సాయం చెయ్యడం మానేసి" అనేది.

నాక్కూడా అలాగే అనిపించేది. మామయ్య ఆ రోజుని సాయం చేసి ఉంటే నన్ను చదివించి ఉంటే ఈ రోజుని నేను ఎంతో ఎత్తుని ఉండేవాడిని. తనని ద్వేషిస్తూనే గడిపాను. ఆ బాధ నన్ను వెంటాడుతునే ఉంది. తన మీది పంతంతోటే తమ్ముడు బీటెక్ చదువుతానంటే కొంత కష్టమైనా చదివించాను. మంజుకి మంచి సంబంధం చూశాను. కిషోర్, ఉదయ్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. బాగా సంపాదించుకుంటున్నారు. నా కళ్ల ముందు పెరిగి, నేను చేయూతనిస్తే ఎదిగిన ఇద్దరూ, ఈ రోజున నా కన్నా ఎత్తుని ఉన్నారు. మా జీవనశైలిలో స్పష్టమైన భేదం. ఈ భేదం ఇలా ఉండటానికి కచ్చితమైన కారణం ఉంది. మామయ్య ముందుకి వచ్చి నన్ను చదివించకపోవటం... అది నన్నెప్పుడూ గుచ్చుతూ ఉంటుంది. అమ్మ కూడా ఆ విషయాన్ని ఎప్పుడూ మర్చిపోయేది కాదు. అలాంటిది, తనిప్పుడిలా అనటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"కొన్ని కొన్ని విషయాలు అర్థం కావటానికి వయసు రావాలి. కొన్ని భ్రమలూ ప్రలోభాలూ తగ్గాలి. మా నాన్నకి ఐదుగురు పిల్లలం. ఇద్దరు మగా, ముగ్గురు ఆడా. నాన్నది పల్లెటూరు. వ్యవసాయం ఉండేది. వరస కరువుల్తో అల్లల్లాడిపోతున్న రోజుల్లో అన్నయ్య బియ్యే చదువుతూ ఆపేసి ఉద్యోగంలో చేరి

పోయాడు. మమ్మల్ని ఆ పల్లెటూర్నించీ తీసుకొచ్చాడు. మా ముగ్గురికీ పెళ్లిళ్లు చేశాడు. తమ్ముడిని చదివించాడు. వదిన కూడా చాలా మంచిది. మమ్మల్ని తన సొంత చెల్లెళ్లలా చూసుకుంది. కానీ మాకు తను పరాయిదాన్లానే అనిపించేది. అన్నయ్య మీద మాకు పూర్తి హక్కున్నట్టూ తను అప్పనంగా మా మీద పడి తింటున్నట్టూ అనిపించేది. అన్నయ్యకి మాత్రం తనంటే చాలా ఇష్టం, గౌరవం. తన సలహా లేకుండా ఏదీ చేసేవాడు కాదు"

"....."

"నిన్ను ఇంజనీరింగు చదివించాలనే తపనే తప్ప అందులోని సాధ్యాసాధ్యాల గురించి నేను ఆ రోజుని ఆలోచించలేదు. ఆ వయసు అలాంటిది. మీ నాన్న కాదన్నారు, అన్నయ్య చదివిస్తాడనే పిచ్చి నమ్మకం. అన్నయ్య దగ్గర మాత్రం ఎక్కడిది అంత డబ్బు? తనకీ పెళ్లైంది. వదినకీ కొన్ని కోరికలూ ఆకాంక్షలూ ఉంటాయి. వాళ్ల పిల్లల్ని చదివించుకోవటానికి పునాదులు వేసుకోవాలి. తన జీవితం తనది... ఇవన్నీ నేను ఆలోచించలేదు. నాకు నువ్వు ముఖ్యం. అలాగే వాళ్లకీ వాళ్ల పిల్లలు ముఖ్యమవుతారనిపించలేదు. చదివించనన్నాడని ఇన్నాళ్లూ వాడిని ద్వేషించాను. ఇప్పుడాలోచిస్తే అనిపిస్తోంది, ఎంత తెలివితక్కువతనమో?"


"తను కొంచెం రిస్కు తీసుకుని నన్ను చదివించి ఉంటే చాలా బావుండేది కదమ్మా? నాకు జాబ్ రాగానే తిరిగి ఇచ్చేసేవాడిని" అనకుండా ఉండలేకపోయాను.

"వాళ్ల అవసరాల టైంకి నీకు ఉద్యోగం రాకపోతే? నువ్వు తిరిగివ్వకపోతే? వాళ్ల పిల్ల నీకు నచ్చకపోతే?"

ఇబ్బందిగా అనిపించింది నాకు. నేనంత చెడ్డవాడినా?

"మన మధ్యతరగతి కుటుంబాల్లో జీవితాలు సుఖసోపానాలు కావు. మనకన్నా పెద్దవాళ్లు మనం అనుభవించిన కష్టాలనీ బాధలనీ మనకన్నా ముందే అనుభవించి బైటపడి ఉంటారు. వాళ్లు కాస్త రిలాక్సవుతూ ఉన్న సమయంలో చూసి, మనకన్నా వాళ్లు సుఖపడిపోతున్నారనుకుని వాళ్లకి మన సమస్యలని బదలాయించాలని చూస్తాం. అది తప్పు. ఇవన్నీ వయసు మీద అర్థం కావల్సిందే తప్ప ఒకళ్లు చెప్తే అర్థమవ్వవు. నిన్ను చూశాక ఇప్పుడిప్పుడు అర్థమవుతున్నాయి. ఇంటరు పాసవ్వగానే ఉద్యోగంలో చేరావు. ఉదయ్, మంజుల చదువులోకానీ, మంజు పెళ్లికి గానీ నాన్నకి సపోర్టు ఇస్తూనే వచ్చావు. దాని వలన నువ్వేం లాభం పొందావు? వాళ్లిద్దరూ పైకొచ్చారు. సంతోషమే. దాని వలన నీకూ నీ భార్యాపిల్లలకీ ఏం వొరిగింది? ఒక్క పాతికవేలు తనవి కావనుకుని నీకివ్వగలిగాడా ఉదయ్ ఎప్పుడేనా? ఎంతొచ్చినా వాళ్లది వాళ్లకే. నా పెన్షనుకి కూడా లెక్కడుగుతుంది అశ్విని. ఎప్పుడూ ఒక్క చీర కూడా నాకు కొనివ్వలేదు తను. అన్నీ విజయే చూసుకుంటుంది" బాధపడుతూ అంది అమ్మ. ఈ విషయాలు నాకు తెలీవు. నా దాకా రావు కూడా.

"అన్నదమ్ములు ఒకరికొకరు సాయం చేసుకోవడం తప్పదు. కానీ మన సమాజంలో అవి పారస్పరికంగా ఉండవు. ఒకళ్లు ఎప్పటికీ తమకి సాయపడుతూ ఉండాలని ఆశిస్తారు. అది మన సంస్కృతిలో ఉన్న లోపమేమో! ఇంక నీ జీవితాన్ని గురించీ నీ పిల్లల గురించీ ఆలోచించుకోవడం మంచిది. విజయ కూడా మనతో సమానంగా అన్నిటికీ సర్దుకుంటూనే గడిపింది. దాన్ని సంతోషపెట్టడం నీ బాధ్యత. తాహతుని మించి ఖర్చు పెట్టి ఇల్లు కట్టడం ఉదయ్ తప్పు. ఇవ్వలేనంత డబ్బుతో అల్లుడిని కొనాలనుకోవడం మంజు తప్పు. ఎదుటివాళ్ల శక్తిని అంచనా వేసుకుని తమ పనులు చేపట్టడం ఇద్దరూ కలిసి చేస్తున్న తప్పు"



అమ్మ మాటలు నన్ను కదిలించాయి. తనని తదేకంగా చూశాను. చాలా పెద్దదైపోయింది. వాళ్ల పెద్దన్నయ్యని చూడాలన్న తపన తన కళ్లలో కనిపిస్తోంది.

"అలాంటి తప్పు చేసి నేను తండ్రి తర్వాత తండ్రిలాంటి అన్నయ్యని దూరం చేసుకున్నాను. వాడు మమ్మల్ని చాలా ప్రేమించే వాడు. ప్రేమే లేకపోతే మా పెళ్లిళ్ల కోసం అప్పులు చెయ్యడు. పొలం అమ్మడు. ఏదో ఒక సంబంధమని చేసి వదిలించుకునే వాడు. మా పెళ్లిళ్లయ్యాక కూడా... పండుగలకీ వాటికీ వెళ్తే ఎవరికేది ఇష్టమో అది చేయించి పెట్టేవాడు. నాకు జిలేబీ ఇష్టమని ఆఫీసు నుంచీ వస్తూ కొనుక్కొచ్చి ఇచ్చేవాడు. అవన్నీ పైపై ప్రేమలని హేళన చేశాను. వాడితో మాట్లాడాలనీ, వాడింటికి వెళ్లాలనీ ఇప్పుడెంతగానో అనిపిస్తుంది గానీ మళ్లీ ఆ ప్రేమలు తిరిగి రావు" అమ్మ గొంతు రుద్ధమైంది.

★ ★ ★

నేను పెద్దమామయ్య ఇంటికి వెళ్లాను. చాలా సంతోషంగా ఉన్నారు అత్తయ్యా మామయ్యాను. నన్నెంతో అభిమానంగా ఆదరించారు. వాళ్ల పిల్లల్లో పెద్దవాడు బొంబాయిలో చేస్తున్నాడట. రెండోది మణి. తననే నాకు చెయ్యమని అప్పట్లో అమ్మ అన్నది. మణికి పెళ్లై ఢిల్లీలో ఉంటున్నదట. చిన్నవాడు వాళ్ల కంపెనీ నుంచి అమెరికా వెళ్లాడట.

"పిల్లల కోసం అంత ఆరాటపడతాం వాళ్లు పెద్దై వాళ్ల దారి వాళ్లు చూసుకున్నాక గానీ తెలిసి రాదు, మన ఆరాటం ఎంత అర్థరహితమైనదో?" అంది అత్తయ్య.

## అభిమానం ముదిరిపోతే...!

హీరోయిన్లకు ఆలయాలు నిర్మించడం తమిళనాడులో బాగా ప్రసిద్ధి. అయితే అదిప్పుడు మనకు కూడా పాకుతున్నట్టుంది. త్రిష వీరాభిమాని ఒకడు ఆమెకోసం గుడి కట్టించాలని సిద్ధమయ్యాడట. రాజమండ్రి దగ్గరలో త్రిష ఆలయాన్ని నిర్మించడం మొదలెట్టి, దాన్ని పూర్తి చేసేందుకు విరాళాలు కూడా సేకరించడం మొదలెట్టాట్ట. ఇది స్థానిక పోలీసుల దృష్టికి రావడంతో వెంటనే నిర్మాణంలో వున్న ఆ కట్టడాన్ని నిర్మూలించడం కూడా జరిగిందిట. అభిమానానికి కూడా ఓ హద్దంటూ వుండాలి! ఇలాంటి విషయంలో ఇమ్మీడియెట్‌గా రెస్పాండ్ అయిన పోలీసులను అభినందించాల్సిందే కదా!

"హాయిగా ఝాంఝామ్మంటూ ఉన్నాం లేవే. ఎక్కడికంటే అక్కడికి వెళ్లొస్తున్నాం" అని ఓదార్చాడు మామయ్య. మా ఇంటికి రావాలని ఎప్పుడూ అనిపించలేదా అని అడగాలనిపించింది గానీ అడగలేకపోయాను.

"ఏవో అనుకుంటాం. అప్పట్లో మా దగ్గర అంత డబ్బు లేదు, చదివించలేనన్నారు మామయ్య. దానికే సంబంధాలు తెగ్గొట్టుకుంటారా? భలే పట్టుదల మీ అమ్మకి. మళ్లీ మా గడప తొక్కింది కాదు. అమ్మమ్మ తాతయ్య పోయినప్పుడు ఆ పల్లెటూరు వచ్చి అట్నుంచీ అటే తిరిగి వెళ్లిపోయింది. మీ నాన్న పోయాక కూడా బాబాయింటికి వెళ్లింది గానీ మా ఇంటికి రాలేదు. ఇంతకీ ఎలా ఉంది?" అడిగింది అత్తయ్య.

అమ్మ అన్న మాటలు చెప్పాను

"నేనసే మాటలు నీకు కష్టం కలిగిస్తాయేమో! అనుభవం మీద చెప్తున్నాను. ఎవరేనా వంగి ఉంటే చాలు, వాళ్ల వీపు ఎక్కేద్దామని చూస్తారు. ఎవరేనా మరొకరి బరువు ఎందుకు మొయ్యాలి? మీ అమ్మావాళ్లలాగే నేనూ పుట్టాను. అందరికన్నా పెద్దవాడిని కాబట్టి నాన్నకి సహాయపడవలసిన బాధ్యత ఉంది. ఎంత దాకా? మరొకళ్లు అందివచ్చే దాకా. ఆడపిల్లలకి పెళ్లిళ్లయ్యాయి. పెట్టవలసినవేవో పెట్టి పంపించాం. వాళ్ల జీవితాలు భర్తలని అనుసరించే"

"ఇప్పుడవన్నీ ఎందుకులెండి? రాకరాక వచ్చాడు. పాత విషయాలన్నీ తవ్వుకోవడం దేనికి?" అంది అత్తయ్య.

"చెప్పనీ అత్తయ్యా! నేనిప్పుడు అవే పరిస్థితుల్లో ఉన్నాను. అందుకే తల తిరిగి చేతికొచ్చింది" అన్నాను నవ్వుతూ.

"ఏమిటి? ఉదయ్ డబ్బు సర్దమంటున్నాడా? చాలా బాగా కట్టిస్తున్నాడటగా, ఇల్లు? ఇరవైదాకా వచ్చిందని విన్నాను. ఎందుకురా, అంత పెద్దిల్లు? ఊర్నిండా అప్పులు చేసి నిద్ర లేని రాత్రులనీ అనారోగ్యాలనీ కొనుక్కోవటం తప్పిస్తే?" అన్నాడు.

సరిగ్గా నాకూ అలాగే అనిపించడం విశేషం. ఎవరి ఆలోచన్లేనా తమకి కష్టం వచ్చాకే సంస్కరించబడతాయేమో?

"ఇంకా మూడు లక్షల దాకా అవసరం పడతాయన్నాడు"

"ఇచ్చాక తిరిగి వస్తేనే మనవనుకోవాలి"

"నీకు తెలీనిదేముంది మామయ్యా? నా దగ్గర అంతెక్కడిది? మా పిల్లలు అప్పుడే ఎనిమిదీ, తొమ్మిదీను. వాళ్లకి టెన్తుకీ ఇంటరుకీ ఎంత కావాలో!" అన్నాను.

సరిగ్గా ఇలాగే మామయ్య కూడా అప్పట్లో మాట్లాడినట్టు గుర్తొచ్చింది. తగ్గట్టే తనూ అన్నాడు. "మీ అమ్మ నిన్ను చదివించమని అడిగింది. నిన్నొక్కడినీ చదివిస్తే సరిపోతుందా? మిగిలినవాళ్లు వాళ్ల పిల్లలని తీసుకొస్తారు. ఇలా ఎంత కాలం? నేనూ మీలాంటివాడినే. నాకూ కోరికలుంటాయి. భార్యాపిల్లల్తో సరదాగా సంతోషంగా గడపాలని ఉంటుంది. పసుపుతాడు తోటీ ముతకచీరతోటీ ఉంచి నా భార్య నుంచి సంతోషాన్నీ సరదానీ ఎలా ఆశించగలను? పిల్లలున్నారు. వాళ్లని చదివించకుండా వాళ్ల భవిష్యత్తు తీర్చిదిద్దకుండా ఎలా? మీ కోసం తలకి మించిన అప్పులు చేసి జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకుంటే నా మిగిలిన జీవితం... నా భార్యాపిల్లలకే పరిమితమైన భాగం ఎలా ఉంటుంది? ఈ రోజున ఈ నిశ్చింతా ప్రశాంతతా ఉంటాయా?"

అందరివీ మధ్యతరగతి జీవితాలే. ఎవరి దగ్గరా అవసరాలని మించిన డబ్బుండదు. ప్రాధమ్యాలని మనమే నిర్ణయించుకోవాలి. దేనికి మనం ప్రాధాన్యత ఇస్తామనే దాని మీద మన సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి.

"మనం తింటూ మన తోటి వాడు పస్తులుంటే చూస్తూ ఊరుకోవటం తప్పు. ఆడపిల్లకి పెళ్లే చెయ్యలేని పరిస్థితిలో ఉన్నారనుకో, పట్టనట్టు ఊరుకోవటం తప్పు. అంతేగానీ వాళ్ల విలాసాలకి సర్దుబాటు చెయ్యలేకపోతే బాధపడక్కర్లేదు" అన్నాడు.

ఆ రోజుకి అక్కడే ఉన్నాను. మామయ్య పిల్లల్తో ఫోన్లో మాట్లాడాను. వాళ్ల నెంబర్లు తీసుకున్నాను. మనసెంతో తేలిక పడింది. పునరుద్ధరించబడిన ఈ అనుబంధం మనసుని తేలికపరిచింది. ఆ రోజున నేను బియ్యేలో చేరి మామయ్యకి చెప్పడానికి వెళ్లి ఉంటే నాకొక జత బట్టలూ, వాచీ కొనిచ్చి ఆశీర్వదించి పంపేవాడేమో! ఈ సంబంధాలు అలాగే నిలిచి ఉండేవి. ఆశీర్వాదాన్ని మించి ఆశించినది ఆయన పిల్లల భవిష్యత్తు. మానవ సంబంధాలలోని మర్మం అర్థమైంది.

* * *

నేను తిరిగొచ్చాను. విజయ అడిగినవి కొన్నాను.

"నువ్వు కొంచెం ముందుగా అడిగి ఉంటే బావుండేదిరా! చేతిలో డబ్బుంటే ఖర్చైపోతుందని వదినకి బంగారం కొనేసి, చవకలో సెకండుహేండు కారొస్తే తీసేసుకున్నాను" అన్నాను ఉదయ్‌తో.

"అవన్నీ ఇప్పుడంత అవసరమా అన్నయ్యా? ఇక్కడ డబ్బు చిక్కక నేను అవస్థ పడుతుంటే?" విసుక్కున్నాడు వాడు. చివుక్కుమనిపించింది.

మంజుకీ అదే చెప్పాను. "మేనమామలు ఉన్నారని ఆశపడ్డాను. ఇక దాని అదృష్టం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది" అంది నిరాశగా.

మా సంబంధాలు బాగా స్ట్రెయినయ్యాయి... అప్పుడు మామయ్యతో జరిగినట్టే.

○

## భూమిక ఆశ!

బాలీవుడ్‌లో తన ఆదరణకి భూమిక సంతోషపడుతున్నా హిందీలో తనదైన గుర్తింపు కోసం తహతహలాడుతోంది. అయితే ఆమె కోరిక 'గాంధీ మై ఫాదర్' సినిమాతో తీరవచ్చునని అంటున్నారు బాలీవుడ్ జనాలు. గాంధీ కొడుకు హీరాలాల్ జీవితం ప్రధాన ఇతివృత్తంగా హీరో అనిల్ కపూర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో భూమిక- హరిలాల్ భార్య గులాబ్‌గా నటిస్తోంది. ఫిరోజ్ అబ్బాస్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తనకి జాతీయస్థాయిలో మంచి పేరు తెచ్చిపెట్టవచ్చునని భావిస్తోంది భూమిక.

